# ప్రేమరాహిత్యం

జె. జ్యోతిర్మయి




“జీవితంలో ఏ పూటా, ఏ రోజూ ఒంటరితనమే. ఎట్‌లీస్ట్ ఇవాళయినా ఇంట్లో ఉంటారనుకున్నాను, ఛ బిజీ, బిజీ జీవితమే బిజీ. లేచింది మొదలు గుర్రాలలాగా డబ్బు వెంట పరుగులు. మనిషిని మనిషి పట్టించుకొనే సమయం ఉండదు. వీళ్ళకి ఆ జంతువులకి తేడా ఏముంది ఎట్‌లీస్ట్ అవన్నా తమ పిల్లల కోసం ఆహారం తీసుకొని సాయంకాలానికి గూడు చేరుకుంటాయి. వాటికి డబ్బు అనే భూతం తెలీదు కదా! పట్టి పీడించడానికి కల్మషం, ద్వేషం అసలే లేవు. కారణం వాటికి నువ్వెక్కువ నేను తక్కువ అనే ఫీలింగ్ లేదు. ఒకరిని ఒకరు దోచుకొనే స్వార్థం వాటిలో లేదు. పంచుకొని తినే స్వభావం వాటిలో వుంది. మానవుడు ఇంకా వాటి నుండి నేర్చుకోవాల్సింది ఉంది! ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు ఇవన్నీ డబ్బు నుండి ఉద్భవించినవే. మనిషి దానికి ఎంత బానిసయ్యాడు. ఛ వెధవ డబ్బు” తన పుట్టిన రోజు పూట ఇంట్లో తన వారెవరూ లేకపోవడంతో విరక్తిగా, కోపంగా తనకి అందిన వస్తువులు పగలకొడ్తూ అనుకుంది శ్రావ్య.

ఒంటరి తనం కొత్త కాదు తనకి. తెలిసే వయసు వచ్చినప్పటి నుండీ అంతే. అంటే గత 20 ఏళ్ళ నుండీ ఇదే ఒంటరితనం. జీవితం పట్ల విరక్తి కలగటం ఆరంభం అయ్యింది శ్రావ్యకి. ఎన్నడూ లేనిది ఆ రోజు చాలా బాధగా ఉంది. తను చచ్చిపోతే కూడా వచ్చి తనని చూస్తారా లేక టైం లేదంటూ..... అనుకొని కళ్ళ నీళ్ళు పెట్టుకొంది శ్రావ్య. అంతకు వారం ముందు నుండి జరుగుతున్న సంఘటనలు గుర్తు రాసాగాయి. ఒంట్లో బాగాలేదు నాన్నా జ్వరంగా ఉంటోంది అని చెప్తే రేపు చూద్దాం “ఐయామ్ వెరీ బిజీ టుడే” రేపు చూద్దాం అన్నాడు తండ్రి జగన్నాథం. లేదంటే డాక్టర్‌కి ఫోన్ చేస్తాను వచ్చి చూస్తాడు అన్నాడే కానీ అదీ లేదు. అమ్మా జ్వరంగా ఉంది అంటే “బేబీ నాట్ నవ్ ఐయామ్ వెరీ బిజీ ఫర్ ఒన్ వీక్” నాకు ప్రోగ్రామ్స్ ఉన్నాయి “ఐయామ్ సారీ బేబీ” అయినా నీవు నాకొక్కదానికే కూతురివి కాదు కదా! మీ నాన్నకి చెప్పు అన్నది. దాంతో తల్లి, తండ్రుల మధ్య చిన్నపాటి యుద్ధ వాతావరణం నెలకొంది. తను వాళ్ళకి చెప్పినందుకు తనని తాను తిట్టుకొంది శ్రావ్య.

తండ్రి గొప్ప “బిజినెస్ మ్యాగ్‌నెట్” తల్లి పేరున్న “సోషల్ వర్కర్” గొప్ప పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. కానీ ఏం లాభం? ప్రేమ కొరత. ఆత్మీయత, అనురాగం కొరత. ఏదో సామెత చెప్పినట్లు “ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత” అన్నట్లు ఇంట్లో లేని ప్రేమ, హార్మనీ గురించి తన తల్లి ‘సోషల్ వెల్ఫేర్’ అంటూ ప్రజలకి ప్రేమ గురించి, హార్మనీ గురించి, నీతులు చెబుతూ లెక్చర్ ఇస్తుంది. నాకంటూ చుట్టూ ఎవరూ లేరు. కేవలం డబ్బు ఉంది. స్నేహితులు ఎవరూ రావడానికి సాహసించరు. కారణం డబ్బు గోడలు చాలా బలంగా కట్టారు అనుకుంది శ్రావ్య. శ్రావ్యకి బాగా నీరసంగా ఉంది. అప్పటికే “హై టెంపరేచర్”తో పాటు నాలుగు వాంతులు అయినాయి. ఇక నడిచే సత్తువ కూడా తనలో

సన్నగిల్లింది. తల్లి ఊళ్ళో లేదు. వెల్‌ఫేర్ అంటూ ఏదో ఊరు వెళ్ళింది. పోనీ తండ్రి అయినా వచ్చి చూస్తాడని ఫోన్ చేస్తే మీటింగ్‌లో బిజీగా ఉన్నారు, పిలిచి డిస్ట్రబ్ చేయడం కుదరదు అంటూ ఫోన్ పెట్టేశారు. పోనీ తనే డాక్టర్ దగ్గరకి వెళదాం అంటే నీరసం. వారం నించి మందులు ఇస్తూనే ఉన్నారు, తను వేసుకొంటూనే ఉంది. కానీ జ్వరం కంట్రోల్ అవ్వకపోగా రోజు రోజుకి పెరిగిపోతోంది. ఇక చేసేది లేక నీరసంగా మంచం మీద పడిపోయి స్పృహ కోల్పోయింది. లంకంత ఇంట్లో ఒక్కతే స్పృహ కోల్పోయి పడిపోయి ఉంటే, ఇల్లు నిస్తేజంగా చూస్తూ ఉండిపోయింది. తండ్రి కూతురు పుట్టిన రోజు కదా! అని గిఫ్ట్ కొనుక్కొని, విష్ చేద్దాం అని ఫోన్ చేస్తే ఎంతకీ, ఎవరూ ఫోన్ ఎత్తక పోయేసరికి అనుమానంగా ఇంటికి చేరాడు. కానీ చేరేసరికి అర్ధరాత్రి దాటిపోయింది.

స్పృహ వచ్చేసరికి శ్రావ్య హాస్పిటల్‌లో వుంది. పక్కన తల్లీ, తండ్రీ రోదిస్తున్నారు. వాళ్ళు ఎందుకలా రోదిస్తున్నారో తనకి అర్థం కాలేదు. కాసేపు తనకి ట్రీట్ చేసిన డాక్టర్‌ని తిట్టారు అన్నీ టెస్ట్‌లు చేయించకుండా ఏవో మందులు ఇచ్చాడు వెధవ డాక్టరు. ఇంత డబ్బు ఉండి ఏం ప్రయోజనం ఈ చివరి క్షణంలో కాపాడుకో లేక పోతున్నాం అన్నారు. అప్పుడు తనకి అర్థం అయ్యింది తను మరణించబోతున్నానని. తనకి వచ్చింది 'వైట్ జాండీస్' అని. గత కొద్ది కాలంగా ఎంత చెప్పినా వినిపించుకోని వీళ్ళకి, నన్ను చూసి రోదించే హక్కు లేదు. "డాక్టర్‌ని ఎందుకు తిడతారు తన వంతు పని తను చేశాడు. కానీ తల్లి, తండ్రులుగా మీరు ఏం చేశారు నాన్న. వాళ్ళిద్దరినీ ఒక్కసారి అసహ్యంగా చూసింది. మీరిద్దరికీ ఏడ్చే హక్కు లేదు నాన్న. డబ్బే మీ కూతురు కదా! దాని వెంటే వెళ్ళండి. ఇప్పుడు నేను లేకపోతే మీ ఇద్దరికీ "ఫుల్ టైమ్ టు ఎర్న్ మనీ" కాదంటారా? కానీ ఏం లాభం "నో బడీ విల్ బీ దేర్ టు ఎన్‌జాయ్ యువర్ మనీ" నాన్న నాకు బతకాలని ఉంది. కానీ మీ నిర్లక్ష్యం కారణంగా నేను "డెత్ బెడ్" మీద ఉన్నాను. మీరు ఒక్కక్షణం నన్ను పట్టించుకొని ఉంటే ఎంతో బావుండేది నాన్న. డబ్బే సర్వస్వం కాదు నాన్న. డబ్బు కంటే ముఖ్యమైనది ప్రేమ, మమకారం. అది ఎలా చెప్తే అర్థం అవుతుంది నాన్న మీకు. ప్రపంచంలో ప్రతి తల్లీ, తండ్రి మీలాగే ఉంటే పిల్లలు ప్రేమ రాహిత్యంతో పెరుగుతారు. అలా అయితే, నేను చచ్చాక ఆ భగవంతుడ్ని కోరుకుంటాను తల్లి, తండ్రులకి డబ్బు పిచ్చి ఉంటే వారికి పిల్లల్ని పుట్టించద్దని వేడుకొంటాను. మనం బతకడానికి కావల్సినంత డబ్బు ఉంటే చాలు నాన్న. ఎవరో ఎప్పుడో అనుభవించాలని మీరు ఇలా కష్టపడి సంపాదించడం మీ పిచ్చి, మూర్ఖత్వం. మీరు డబ్బు సంపాదించడంలో గొప్ప ఎక్స్‌పర్ట్స్ అయినా పేరెంట్స్‌గా మీరు గొప్ప ఫెల్యూర్స్. ప్రపంచంలో ఏ తల్లీ, తండ్రి ఇలా ఉండకూడదని కోరుకుంటున్నాను. ఎట్‌లీస్ట్ ఇప్పటికైనా మారండి నాన్న. ప్లీజ్ ఏడవకండి. ఏడ్చే హక్కు మీకు లేదు "నో డోన్ట్ క్రై యు హేవ్ లాస్ట్ దట్ రైట్." అమ్మా నువ్వు సోషల్ వెల్‌ఫేర్ అంటావు, నీ ఇంటి వెల్‌ఫేర్ మర్చిపోయావు. ఆచరించనివి చెప్పకూడదమ్మా. వచ్చే జన్మలో అయినా మీకు తల్లిగా పుట్టి ప్రేమంటే ఏమిటో రుచి చూపుతాను. ఈ జన్మలో ఎలాగూ సాధ్యం కాదు కదా! దెయామ్ వెరీ మచ్ థాంక్ ఫుల్ టు గాడ్" నన్ను త్వరగా మీకు అడ్డు తొలగిస్తున్నాడు. ఇక సంపాదించుకోండి డబ్బు. మీకు నా నుండి విముక్తి లభించింది" అంటూ తుది శ్వాస వదిలింది శ్రావ్య.

శ్రావ్య తల్లి, తండ్రులు ఆలోచనలో పడ్డారు. అది డబ్బు ఎలా సంపాదించాలా అని కాదు ప్రేమ రాహిత్యంతో పెరుగుతున్న పిల్లలకి వాళ్ళ వంతుగా వాళ్ళు ఏం చేయగలరు అని. ప్రపంచంలో డబ్బు పిచ్చి ఉన్న తల్లి, తండ్రులకి ఇది హెచ్చరిక కావాలనుకున్నారు. ❊

## వీరతార

అల్లూరి సీతారామరాజు పేరు చెబితేనే రక్తం ఉరకలు వేస్తుంది ప్రతి ఒక్కరికీ. అటువంటి వంశంలో పుట్టిన అల్లూరి సునితావర్మ తాజాగా సినిమాల్లో నటిస్తోంది. వీరనారిగా రూపుదిద్దుకోవలసిన మీరు సినిమా నటిగా మారడంలో గల ఆంతర్యం ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానంగా 'వృత్తులు ఏవయినా ప్రవృత్తులు మారవు. నా ఆశయం పదిమందికీ మంచి చేయడమే!' అంటోంది వీరతార. (తెలుగు సినీ తారామణుల్లో ఎలాంటి విప్లవం తీసుకొస్తుందో మరి వేచిచూద్దాం!)



